క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కాకినాడ: నగరంలోని తొమ్మిది ప్రాంతాల్లో మంగళవారం నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహా రావు సోమవారం తెలిపారు. ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ కోసం మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నంబర్, మెయిల్ అడ్రస్ అనుసంధానం, బయోమెట్రిక్ (ఫొటో–ఐరిష్–వేలిముద్ర) అప్‌డేట్, పేరు, పుట్టినతేదీ, చిరునామాల్లో మార్పులు, ఆధార్ డౌన్‌లోడ్ చేసుకోవడం, కొత్త ఆధార్ నమోదు వంటి సేవలను పొందవచ్చన్నారు. అర్బన్ పరిధిలో కృష్ణనగర్–2ఏ, డైరీఫారం 11ఏ, గోళీలపేట 14ఏ, యానాంరోడ్డు 15ఏ, చిన్నమార్కెట్ 21ఏ, యాళ్లవారివీధి 28బీ, బ్యాంక్‌పేట 32ఏ, గాంధీనగర్ 38ఏ, గైగోలుపాడు 50బీ సచివాలయాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణంపై మాట్లాడుతున్న బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ అన్నారు. స్థానిక సాలిపేట మున్సిపల్ బాలికోన్నత పాఠశాల వద్ద పర్యావరణంపై సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూకాలుష్యం వల్ల సకాలంలో వర్షాలు పడడం లేదని, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అన్నారు. జాతీయ బాలల సైన్స్ జిల్లా కోఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణంలో మార్పులకు మనవంతు బాధ్యత తీసుకోవాలన్నారు. హెచ్ఎం సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న కస్టమ్స్ కమిషనర్ సాధునరసింహారెడ్డి

కాకినాడ: మానసిక ఒత్తిడిని అధిగమిస్తే విజయం సొంతం అవుతుందని కస్టమ్స్ శాఖ కమిషనర్ సాధునరసింహారెడ్డి అన్నారు. కాకినాడ కస్టమ్స్ హౌస్‌లో విధి నిర్వహణలో ఒత్తిడిని ఎలా అధిగమించాలనే అంశంపై సోమవారం ఉద్యోగులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 'ప్రశాంతమైన మనస్సు– సంతోషకరమైన హృదయం– నాయకత్వం' అనే అంశంపై బ్రహ్మకుమారిల ప్రతినిధి బీకే షీల వివరించారు. ఈ సందర్భంగా సాధునరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి వృత్తిలో ఒత్తిడి సహజమని, అయితే ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ ఆ ఒత్తిడిని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.విజయ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వీరవెంకటరెడ్డి, సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వేధింపుల నిరోధక కమిటీలు వేయాలి



శ్రామిక మహిళా సదస్సులో మాట్లాడుతున్న బేబీరాణి

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.బేబీరాణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టీచర్స్ హోమ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతకు మహిళలంతా పోరాడాలన్నారు. నాయకులు చెక్కల రాజ్‌కుమార్, చంద్రమళ్ల పద్మ, రాజు, తలుపులమ్మ షేక్ పద్మ, నీరజ, నర్ల ఈశ్వరి, దువ్వా శేషుబాబ్జీ పాల్గొన్నారు.

సీఐటీయూ ధర్నా

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తుందంటూ సోమవారం స్థానిక డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు కొనసాగించాలని, కార్మిక సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు జె.వెంకటేశ్వర్లు, గంటా బేతాళుడు, చవ్వాకుల రాఘవ, బందారి బాబూరావు, అడపా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అహో... అందాల భవనం

- టిడ్కో ఇళ్ల అప్పగింతకు ముహూర్తం ఖరారు
- 25న గృహ ప్రవేశాలు



సిద్ధమైన టిడ్కో గృహాలు

కాకినాడ: అందాల భవనం అందివచ్చింది.. సర్వాంగ సుందరంగా ముస్తాబై రా రమ్మని పిలుస్తోంది.. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న టిడ్కో ఇళ్ల అందజేతకు ముహూర్తం ఖరారైంది. గత టీడీపీ ప్రభుత్వ తప్పిదాల కారణంగా లబ్ధిదారులకు నాలుగేళ్ల నిరీక్షణ అనివార్యమైంది. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో ఈ నెల 25వ తేదీ శ్రావణ శుక్రవారం రోజున లబ్ధిదారులకు గృహాలను అప్పగించాలని నిర్ణయించారు. దీంతో సొంతింటి కల నెరవేరబోతోందంటూ టిడ్కో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. సకల సౌకర్యాలతో ఇళ్లను ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది లబ్ధిదారులకు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది.

తొలివిడతలో 1,152 మందికి..

కాకినాడ పర్లోపేటలో 2,056 టిడ్కో గృహాలను నిర్మించారు. ఇందులో తొలివిడతగా 1,152 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆ నివాసాల వద్ద రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయాలు, సకల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇళ్లకు రంగులు వేసి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేస్తున్నారు. టిడ్కో అపార్ట్‌మెంట్‌ల యూనిట్ విలువ రూ. 7.65 లక్షలుగా తేలింది. రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని సమకూర్చి మౌలిక సదుపాయాలు కల్పించి, రూ.2 లక్షలు సమకూరుస్తోంది. అలాగే రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వ వాటాగా ఇస్తోంది. మరో రూ. 50 వేలు లబ్ధిదారుల వాటాగా నిర్ణయించారు. రూ.3.65 లక్షలు ప్రభుత్వమే బ్యాంకు రుణంగా సమకూరుస్తోంది. దీంతో పాటు 2,056 గృహాల వద్ద రూ. 15 కోట్లు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అలాగే మురికినీటి శుద్ధి ప్లాంట్‌ను కూడా ఇక్కడ నిర్మిస్తున్నారు. విద్యుదీకరణ కోసం రూ.8 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు.

నాటి అవకతవకల వల్లే జాప్యం

టిడ్కో ఇళ్లకు సంబంధించి టీడీపీ హయాంలో చేసిన తప్పిదాల వల్ల లబ్ధిదారులు నరకం చూశారు. అప్పులు చేసి డబ్బుకట్టినప్పటికీ ఇళ్లను అందిపుచ్చుకోలేకపోయారు. వాస్తవానికి పర్లోపేటలో 2,056 ఇళ్లు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేస్తే దాదాపు 4 వేల మంది లబ్ధిదారుల నుంచి డీడీలు తీసుకుని గోల్‌మాల్ చేశారు. ఇళ్లు ఇప్పిస్తామని అప్పటి టీడీపీ నేతలు లబ్ధిదారుల నుంచి ముడుపులు దిగమింగారు. మంజూరైన ఇళ్లకు, లబ్ధిదారులకు మధ్య పొంతన లేని పరిస్థితుల్లో ఇళ్ల అప్పగింతకు తీవ్ర జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవ తీసుకుని టిడ్కోలో మిగిలిపోయిన లబ్ధిదారులకు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థలాలు కేటాయించి ప్రత్యామ్నాయం చూపించే దిశగా అడుగులు వేశారు. ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన నిధులు రప్పించి సదుపాయాల కల్పన, ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడంతో సమస్య కొలిక్కి వచ్చి లబ్ధిదారులకు అప్పగించే పరిస్థితికి చేరుకుంది.

ఇచ్చిన మాటకు కట్టుబడి



టిడ్కో ఇళ్లను ఈ నెల 25న లబ్ధిదారులకు అప్పగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. శ్రావణ శుక్రవారం కొత్త ఇళ్లలో గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. తొలివిడత సుమారు 1,152 ఇళ్లను అప్పగించేందుకు కృషి జరుగుతోంది. మిగిలిన ఇళ్లనూ అతి త్వరలోనే అప్పగిస్తాం. పేదల సొంతింటి కలను నిజం చేసే క్రమంలో కొన్ని అవరోధాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తున్నాం.

–ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే

వృద్ధులను ఆదరిద్దాం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను సత్కరించారు. ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్ మాట్లాడుతూ వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తుంటే, ప్రతి ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురవుతున్నారన్నారు. వృద్ధులకు ఏమైనా సమస్యలు వస్తే జాతీయ హెల్ప్‌లైన్ 14567కు ఫోన్ చేయాలని సూచించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారులను ప్రోత్సహించాలి



ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: మండలంలో యువ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని ఎంపీడీఓ కె.అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల గ్రామ కార్యదర్శులు, పాఠశాలల పీడీలు, పీఈటీలు, విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. అక్టోబరులో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమీక్ష జరిపి, ఆయన పలు సూచనలు చేశారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో ఆసక్తి ఉన్న 17 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులను గుర్తించాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి, మండల, జిల్లా స్థాయిలో సభ్యత్వంతో ఆయా క్రీడా జట్లను ఎంపిక చేయాలన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ సచివాలయ పరిధిలో ఆటల పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేణి, ఎంఈఓ–2 ప్రత్తి సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

బాలాజీచెరువు: బీటెక్ అభ్యసిస్తున్న పేద విద్యార్థికి హెల్త్ అవేర్‌నెస్ సంస్థ చేయూత అందించింది. సోమవారం స్థానిక గాంధీనగర్‌లో డాక్టర్ చప్పిడి పూర్ణసురేష్ ఆధ్వర్యంలో ఆ విద్యార్థి తల్లికి రూ.5 వేలు ఇచ్చారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదని, ఇటువంటి వారిని ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హెల్త్ అవేర్‌నెస్ సంస్థ అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, వనుం ఉపేంద్రనాథ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం మనదే..

- శ్రేణులంతా కలసికట్టుగా సాగాలి
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం



హరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు



ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నారాయణరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ: వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డీ–కన్వెన్షన్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో దాదాపు అభివృద్ధి పనులన్నీ పూర్తి చేశామని, ఎక్కడైనా పెండింగ్ పనులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయా బూత్ కమిటీ, డివిజన్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలూ శ్రమిస్తున్నారని, వాస్తవాలను ప్రజలకు వివరించి, పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చేలా కష్టించి పని చేయాలన్నారు.

హరికి ఘన నివాళి

ఇటీవల మృతి చెందిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ బందన హరికి పార్టీ తరఫున ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. హరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయం కోసం బందన హరి ఎంతో కృషి చేశారని, డ్రెఫిష్ మార్కెట్, చేపల మార్కెట్‌లకు బందన హరి పేరు పెడతామన్నారు. హరికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని సీఎం ఆదేశించారని, అయితే సాంకేతికపరమైన కారణాలతో చేయలేకపోవడం ఎంతో బాధించిందన్నారు.

ఎమ్మెల్సీకి సత్కారం

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన కర్రి పద్మశ్రీ నారాయణరావు దంపతులను ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా వాడబలిజ మత్స్యకార వర్గం నుంచి ఓ మహిళను ఎంపిక చేయడం చరిత్రలోనే ప్రథమమని, మత్స్యకారుల పట్ల సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని చంద్రశేఖరరెడ్డి అన్నారు. కాగా కాకినాడ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ మల్లిఖార్జున్, నియోజకవర్గ పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు, జిల్లా పార్టీ ఎన్నికల సమన్వయకర్తగా నియమితులైన రావూరి వెంకటేశ్వరరావులను ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో ఘనంగా సత్కరించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘ భవనానికి స్థలం

ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు



సత్యనారాయణ, జెడ్పీటీసీ తదితరులను సత్కరిస్తున్న యాదవ సంఘ ప్రముఖులు

కాకినాడ రూరల్: ఏళ్ల తరబడి జిల్లాలోని యాదవ సంఘ నాయకులు, కులస్తులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. కాకినాడ జిల్లా యాదవ సంక్షేమ సంఘ సామాజిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థలం కేటాయించారు. వాకలపూడిలో విలువైన స్థలం కేటాయించడంతో యాదవ కులస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తమ వినతి మేరకు స్థలం కేటాయించిన కన్నబాబును వారు సోమవారం కలసి ధన్యవాదాలు తెలియజేశారు. వాకలపూడిలో స్థలం వద్దకు చేరుకుని పరిశీలించడంతో పాటు కన్నబాబు తండ్రి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీలను సత్కరించి తమ అభిమానాన్ని చాటారు. సంఘ నాయకులు ఒమ్మి రఘురామ్, అల్లి రాజబాబు, జిల్లా యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మసుమేను గంగయ్య, కోశాధికారి పి.మహేష్, కార్యదర్శి కె.బాబూరావు, యూత్ ప్రెసిడెంట్ నేమాల బాబీ, కార్యదర్శి నమ్మి లక్ష్మణ, ఇసరపు అప్పారావు, తదితరులు పాల్గొని త్వరలోనే యాదవ సంక్షేమ సంఘ సామాజిక భవన నిర్మాణం చేపడతామన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అతివలకే అందలం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- యానిమేటర్లు, ఆర్పీలతో ఆత్మీయ సమావేశం



యానిమేటర్లు, ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ క్రాంతి పథకం యానిమేటర్లు (వీఓఏలు), రీసోర్సుపర్సన్లతో రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు వీఓఏలు, ఆర్పీలు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమకు వేతనం పెరిగిందని కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో రూరల్ నియోజకవర్గంలో మొత్తం 5,616 డ్వాక్రా గ్రూపుల్లో 60 వేల మంది మహిళలకు బ్యాంక్ లింకేజీగా రూ.661 కోట్ల రుణం ఇచ్చారని, ఆసరా రుణమాఫీగా రూ.118.64 కోట్లు ఇచ్చారన్నారు. సున్నా వడ్డీ కింద రూ.40.50 కోట్లు, స్త్రీనిధి కింద రూ.40 కోట్ల రుణాలు అందజేశామన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద విద్యార్థులకు చేయూత అందిస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా మూడు వేల రోగాలకు కార్పొరేట్ వైద్య అందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కన్నబాబు కోరారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలను నమ్మవద్దని ఆయన అన్నారు. ఆసరా రాని మహిళా సంఘాల పేర్లను తీసుకున్నామని ఆయా సంఘాలకు జమ అయ్యేలా కలెక్టరు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

భజన బృందాలకు ఓటమి తప్పదు

చంద్రబాబు, ఆయన భజన బృందాలకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని కన్నబాబు అన్నారు. అధికారంలోకి వస్తే వలంటీర్లను తీసివేస్తామని దమ్ముంటే మేనిఫెస్టోలో పెట్టాలని చంద్రబాబుకు కన్నబాబు సవాల్ విసిరారు. గత ఎన్నికల్లో డ్వాక్రా, రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశాడన్నారు. అగ్నికి ఆజ్యం పోసినట్లు చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తోడయ్యారని, రోజూ టీడీపీ అనుకూల పత్రికలు చూస్తే ఏదో అరాచకం జరుగుతున్నట్టు రాస్తున్నాయన్నారు. చంద్రబాబు, పవన్, లోకేష్‌లు ముగ్గురూ కలసి రోడ్లు ఎక్కి తిరుగుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వారు ఏమీ చేయలేరన్నారు. లోకేష్‌ను చూసి జాలి వేస్తుందన్నారు. యానిమేటర్ భవాని మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని కన్నబాబు సహకారంతో కలిశామని, ఆయన ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత వేతనం రూ.8 వేలకు పెంచారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, ఎంపీపీలు గోపుశెట్టి పద్మజ, పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మల మడక నాగమణి, సర్పంచ్‌లు రామదేవు చిన్నా, బెజవాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్ఈ సత్యకుమారి

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి చెప్పారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి ఫోన్‌లో వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం స్పందనలో కూడా ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా పై రెండు అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ఆయా అంశాలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రెండో డివిజన్‌లో గడప గడపకూ..



రెండో డివిజన్‌లో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. కాకినాడ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలో కొండేలుపేట, బొందగుంట, ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డు, సురేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సాంకేతిక కారణాలతో అర్హులకు ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రూరల్ నియోజకవర్గంలో 90 శాతానికి పైగా లబ్ధి పొందారన్నారు. అలాగే రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గడప గడపకూ నిధులతో ప్రజల విన్నపాల మేరకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్పొరేషన్ డీఈ వెంకట్రావు, ఏఈ రమేష్‌బాబు, డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాటి సూరిబాబు, నాయకులు గుత్తుల సూర్యప్రకాశరావు, జమ్మలమడక నాగమణి, నల్ల రాణి, కొవ్వాడ ఉప సర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

త్వరలోనే మళ్లీ డివిజన్ పర్యటనలు

గడప గడపకూలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: గడప గడపకూ మన ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేందుకు త్వరలోనే అన్ని డివిజన్లలో తిరిగి పర్యటిస్తానని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక 35వ డివిజన్‌లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలసి ఆయన ఇంటింటా పర్యటించారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనతో అన్ని వర్గాల ప్రజల్లో సంతోషం నెలకొందన్నారు. కాకినాడలో ఐదు డివిజన్ల పరిధిలోని 16 సచివాలయాల్లో మాత్రమే గడప గడపకూ మన ప్రభుత్వం జరగాల్సి ఉందని, సెప్టెంబర్ 10వ తేదీకి అది కూడా పూర్తి చేయాలని షెడ్యూల్ నిర్ణయించుకున్నామన్నారు. అనంతరం ఇచ్చిన హామీలను అమలు చేసిన విషయాన్ని ప్రజలకు వివరించేందుకు డివిజన్ బాట పడతామన్నారు. 35వ డివిజన్‌లోని స్థానికులు రెండుచోట్ల రహదారులు నిర్మించాలని కోరారని, వాటిని కూడా నిర్మిస్తామన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ బెండ విష్ణు, మాజీ కార్పొరేటర్ బవులూరి రామకృష్ణ ఉన్నారు.

ఏఓగా వెంకటలక్ష్మి

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓగా వెంకటలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఏఓగా పనిచేసిన పద్మజ జగ్గంపేట డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ కావడంతో కాకినాడ ఆర్డీఓ కార్యాలయ ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటలక్ష్మికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు ఆమె ఎఫ్ఏసీ ఏఓగా బాధ్యతలు స్వీకరించారు.

ముగ్గురికి గాయాలు

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వేట్లపాలెం– మేడపాడు మధ్యలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. దీంతో మేడపాడుకు చెందిన గరికపాటి జితేంద్ర, కొంకుదురులో వెలమపేటకు చెందిన పులి శ్రీను, దేవి దంపతులు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో వేట్లపాలెం పీహెచ్‌సీకి తరలించారు.

'చింతా'కు అభినందన

కరప: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యుడిగా కరప మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు సోమవారం గుంటూరులో జరిగిన మొదటి సమావేశానికి హాజరయ్యారు. ఈ మేరకు మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చోడిశెట్టి చంటి, రొక్కాల తారకేష్ తదితరులు గుంటూరు వెళ్లి చింతాను కలసి అభినందనలు తెలిపారు. బోర్డు సమావేశంలో ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి, కొత్త వరి వంగడాలు రూపొందించడంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగినట్లు ఈశ్వరరావు తెలిపారు.